సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం : 7 : సెప్టెంబర్ : 2024





## జూరాలకు మళ్లీ వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరిగింది.

వివరాలు 10లో ▸



## జలదిగ్బంధంలో చిన్నోనిపల్లె

రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ వచ్చి చేరుకోవడంతో చిన్నోనిపల్లె జలదిగ్బంధమైంది.

వివరాలు 10లో ▸

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.2/22.1

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### సీఈఐఆర్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల గుర్తింపు

**గద్వాల క్రైం:** దొంగిలించిన సెల్‌ఫోన్‌లను గుర్తించేందుకు సీఈఐఆర్ అప్లికేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలు ఎవరైన తమ సెల్‌ఫోన్లు పోగుట్టుకున్న క్రమంలో వీలైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అప్లికేషన్‌లో సదరు మొబైల్ ఐఎంఈఐ నంబర్ ఎంటర్ చేసి దొంగిలించిన ఫోన్‌లోని డేటాను క్లియర్ చేయడం, మొబైల్‌ను బ్లాక్ చేయడం, ఆ ఫోన్‌లో కొత్తగా ఏ సిమ్ వేశారు, లొకేషన్ ఇలా అన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,332 సెల్‌ఫోన్స్ అపహరణకు గురైన క్రమంలో బాధితులు ఫిర్యాదు చేయగా.. ఇప్పటి వరకు 1,330 మంది సెల్‌ఫోన్స్ గుర్తించి 849 సెల్‌ఫోన్స్‌ను రికవరీ చేశామన్నారు. అన్ని పోలీసు స్టేషన్‌లో ఈ కేసుల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బంది సేవలు అందిస్తున్నారన్నారు. సమావేశంలో సిబ్బంది రజిత, ఆకాష్, వీరేష్, మస్తాన్, రఘునాథరెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

### బీచుపల్లి ఆలయాల్లో కుంకుమార్చన పూజలు



**ఎర్రవల్లి:** బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు బీచుపల్లికి చేరుకొని సరస్వతీదేవిని దర్శించుకున్నారు. అదేవిదంగా ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు నర్సింహస్వామి ఆధ్వర్యంలో కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### తుమ్మిళ్ల లిఫ్టుకు ఎలాంటి ప్రమాదం లేదు



**రాజోళి:** తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి వేసిన పైప్ లైన్ రోడ్డు దెబ్బతినడం వల్ల లిఫ్టుకు ప్రమాదం పొంచి ఉందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆర్‌డీఎస్ ఏఈఈ వరుణ్ కుమార్ అన్నారు. గురువారం 'సాక్షి'లో కోతకు గురైన తుమ్మిళ్ల పైపులైన్ రోడ్డు వార్తకు ఆయన స్పందించారు. రోడ్డు వద్దకు వెళ్లి పరిశీలించారు. వర్షాలకు అక్కడున్న పొలాల్లో నీరు చేరుతుందని, దాని కోసం గతంలోనే ఏర్పాటు చేసిన పైప్ లైన్ ద్వారా నీరు వెళ్తుందని, కురుస్తున్న వర్షాలకు అది దెబ్బతిందని తెలిపారు. సోషల్ మీడియాలో కొందరు అనవసరంగా తుమ్మిళ్ల ఎత్తిపోతలకు ప్రమాదముందని చెబుతున్నారని, ఇలాంటి వార్తలన్నీ ఎవరూ నమ్మవద్దన్నారు. ఆ రోడ్డుపై అసలు ఎలాంటి వాహనాలు తిరగడానికి వీలు లేదని, అయినా కూడా పెద్ద వాహనాలు తిరగడం వల్ల రోడ్డే దెబ్బతిందని అన్నారు. అయినప్పటికీ రోడ్డును మరమ్మతు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం కూడా రోడ్డు విషయం తెలుసుకుని మరమ్మతు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు 3, హిందీ 1, ఉర్దూ 1, కామర్స్ 1, ఫిజిక్స్1 అప్లైడ్ న్యూట్రీషన్ 1, హిస్టరీ 3, పొలిటికల్ సైన్స్ 1 , జువాలజీ 2, కంప్యూటర్ అప్లికేషన్ 1, బోటనీ 1, గణితం 1 సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు ఈనెల 11వ తేదీ లోగా కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని, అనంతరం ఇంటర్వ్యూల ఆధారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### ఎన్‌ఎంఎంఎస్‌లో పేరు నమోదుకు అవకాశం

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్‌షిప్ 2024–25 విద్యాసంవత్సరం ఎంపికైన వారు తమ పేరును నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ నమోదు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఈఓ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# గల్లీ గల్లీలో గణపయ్య



గద్వాల మార్కెట్‌లో భక్తుల సందడి

**నేటినుంచి వినాయక చవితి ఉత్సవాలు**

- విభిన్న ఆకృతుల్లో కొలువుదీరనున్న గణనాథులు
- ముస్తాబైన మండపాలు.. కిటకిటలాడిన మార్కెట్లు
- వివిధ ప్రాంతాల నుంచి తరలిన వేలాది విగ్రహాలు



తరలుతున్న భారీ గణనాథులు

**గద్వాల టౌన్/గద్వాల క్రైమ్:** ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వినాయక చవితి రానే వచ్చింది. కుల, మతాలకతీతంగా వాడవాడలా విఘ్న నాయకులను భక్తి శ్రద్ధలతో నెలకొల్పే సమయం ఆసన్నమైంది. గణేష్ నవరాత్రి వేడుకలు ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు వచ్చాయంటే చాలు.. నవరాత్రులు వాడవాడలా సంబరాలు, భారీ గణనాథులు.. రంగు రంగుల విద్యుద్దీపాలు.. ఆకట్టుకునే మండపాలతో సుందరంగా తీర్చిదిద్దుతారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఈ ఏర్పాట్లలోనే నిమగ్నమవుతారు. అయితే, విగ్రహ మండపాల ఏర్పాటు, పూజలు, ఊరేగింపు, నిమజ్జనం ఇలా ప్రతి సందర్భంలో చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే నవరాత్రులు విజయవంతమేనట్లే. విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు లభించినట్లే.

**మండపాల ముస్తాబు**

వినాయక ఉత్సవాలకు మండపాలు సిద్ధమయ్యాయి. శనివారం నుంచి ఉత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వాడవాడలా బొజ్జ గణపయ్యలను ప్రతిష్ఠించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక విగ్రహాల అమ్మకాలు జిల్లా కేంద్రంలో ఊపందుకున్నాయి. విగ్రహం సైజును బట్టి ధరలను నిర్ణయించారు.

**సందడిగా మార్కెట్లు..**

విగ్రహాల కొనుగోలు, చవితి ఉత్సవాల పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్ సందడిగా నెలకొంది. కొన్ని చోట్ల మట్టి గణపతులను విక్రయిస్తున్నారు. ఇళ్లలో పూజలు నిర్వహించే మహిళలు మట్టి గణపతుల కొనుగోలుకు ఆసక్తి చూపారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మార్కండేయస్వామి ఆలయం, పాత హౌసింగ్‌బోర్డు, ఆకార్ యూత్, టీటీ యూత్ తదితర సంఘాలు ఏర్పాటు చేసే గణేష్ మండపాలు, శాంతిప్రియ యువజన సంఘం, పాండురంగస్వామి ఆలయంలో ప్రతిష్ఠించే గణనాథులు జిల్లా కేంద్రానికే తలమానికంగా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి గద్వాల మీదుగా రాయచూర్‌కు వాహనాలలో తరలుతున్న భారీ గణనాథులు స్థానికులకు కనువిందు చేస్తున్నాయి. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులకు పోలీసులు ఇప్పటికే ముందస్తు సూచనలు చేశారు.

### శాంతియుతంగా నిర్వహించుకోవాలి



పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి. విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న వారు పోలీసుశాఖ అనుమతులు తప్పనిసరిగా పాటించాలి. మండపాల వద్ద ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచాం. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నదుల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం.

– శ్రీనివాసరావు, ఎస్పీ

### పోలీసుశాఖ అనుమతి తప్పనిసరి

మండపాల ఏర్పాట్లలో ప్రధానంగా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం అధికంగా ఉంటుంది. మరోవైపు కొందరు వ్యక్తులు గతంలో చోటు చేసుకున్న ఘటనలు మనసులో పెట్టుకుని అల్లర్లకు పాల్పడే అవకాశం ఉంది. దీంతో గతేడాది చోటు చేసుకున్న ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా జిల్లా పోలీసుశాఖ అప్రమత్తం అయ్యింది. మండపాల ఏర్పాటుకు జిల్లా పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందిగా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. మండపాల వద్ద సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయనున్నారు. ఇదివరకే జిల్లా వ్యాప్తంగా శాంతి సమావేశాలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ మండపాలకు నేరుగా కనెక్షన్ తీసుకోవద్దని, విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జనం సమయంలో వేలాడే విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

### మట్టి విగ్రహాల వితరణ

**అయిజ/ ఎర్రవల్లి:** మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న మున్సిపల్ సిబ్బందితో కలిసి మట్టి వినాయకుడి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందజేశారు. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణం కాపాడుకుందామని, ఉత్సవాలను సామరస్యంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ కోరారు. అదేవిధంగా ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా మట్టి గణనాథులను తయారు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ప్లాస్టిక్ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను, మట్టి విగ్రహాల వల్ల కలిగే లాభాలను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.



మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

### ఆవంచలో ఏకశిలా గణపతి



దుందుభీ తీరంలో తిమ్మాజిపేట మండలం ఆవంచలో దేశంలోనే ఎత్తైన ఏకశిలా వినాయకుడి విగ్రహం ఉంది. తెలుగు నేలను పాలించిన ఇక్ష్వాకులు గణపతి భక్తులు కావడంతో క్రీ.శ.12వ శతాబ్దంలో దాదాపు 30 అడుగుల ఎత్తైన ఏకశిలా గణపతిని ఏర్పాటు చేసినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. స్థానికులు ఐశ్వర్య గణపతిగా పిలిచే ఈ గణనాథుడికి ఆలయం నిర్మాణం జరగకపోవడంతో ఈ విగ్రహం వందల ఏళ్లుగా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తోంది. వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ఆవంచ గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. – నాగర్‌కర్నూల్

### నిమజ్జనం ఎరుగని గణనాథుడు



**నారాయణపేట రూరల్:** సాధారణంగా ఆలయాలు.. మండపాలు.. ఇళ్లల్లో చవితిరోజు ప్రతిష్ఠించిన వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి 5, 9, 11వ రోజుకు నిమజ్జనం చేయడం చూస్తుంటాం. కానీ, నారాయణపేటలోని పళ్లబురుజ్ ప్రాంతంలోని దీక్షిత్ నివాసంలో దాదాపు 700 ఏళ్లకుపైగా గణనాథుడు నిమజ్జనం లేకుండా నిత్యపూజలు అందుకుంటున్నాడు. 13వ శతాబ్దానికి చెందిన గణనాథుడిని నాటి నుంచి వారి కుటుంబసభ్యులు కొలుస్తూ వస్తున్నారు. ఇక యేటా వినాయకచవితి నుంచి 11 రోజులు పెద్ద సంఖ్యలో భక్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

# మట్టి వినాయకులను ప్రతిష్ఠించండి



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాలటౌన్:** మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో మట్టి వినాయకులను సమకూర్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులతో పాటు పట్టణంలోని పలువురికి ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కాలుష్యానికి కారకంగా నిలుస్తున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ప్రతిష్ఠించకుండా చూడాలన్నారు. ప్రతి ఏడాది మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయడానికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వపరంగా అందిస్తామన్నారు. తద్వారా కులవృత్తులను ప్రోత్సహిస్తామని చెప్పారు. అధికార యంత్రాగం ఏర్పాటు చేసిన బీచుపల్లి, నది ఆగ్రహారం, జమ్మిచేడు, జూరాల డ్యాం ప్రాంతాలలో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. గద్వాలకు వెయ్యి, అయిజకు 500, అలంపూర్‌కు 250, వడ్డేపల్లికి 250 మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్ నర్సింగరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, ఏఓ వీరభద్రప్ప, డీఎం విమల, కార్యాలయ సిబ్బంది, శాలివాహన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎకోక్లబ్, ఎన్ఎస్ఎస్, క్లైమైట్ స్మార్ట్ గ్రీన్ క్యాంపస్ క్లబ్ సంయుక్తంగా పర్యావరణ రహిత మట్టి గణపతులను తయారు చేసి, వాటి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆర్య వైశ్య, పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు.

# సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ఇటిక్యాలలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ

**ఎర్రవల్లి:** వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు ఎల్లప్పుడూ అవగాహన కల్పించాలని సూచించారు. గుంతలతో పాటు ఇంటి పరసర ప్రాంతంలో నిలిచిన నీటిని తొలగించాలని, పల్లెల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించాలని, ప్రజలు పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకొని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. వర్షాకాల ఆరోగ్య అలవాట్లపై ఏఎస్ఎంలు, ఆశాలు ప్రజలకు సూచించాలని పేర్కొన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలో చెరువు నుంచి ఉధృతంగా పారుతున్న వాగును పరిశీలించి ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ సుష్మా, ఎంపీడీఓ అజార్‌మొహియుద్దీన్, ఎంపీఓ ఆంజనేయరెడ్డి, వైద్య సిబ్బంది శేఖర్, వెంకటేశ్వర్లు, చంద్రనాగమ్మ, సత్యమ్మ, ఆయా గ్రామాల ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేస్తే గుర్తింపు



ఎర్రవల్లిలో సంపత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

**ఎర్రవల్లి:** పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తప్పకుండా గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. ఇటీవలె చత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి కూడలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఆయనకు కూడలిలో పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసి అధిక స్థానాలు గెలుపొందేలా కృషిచేయాలన్నారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో కూడా అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. వారి ప్రమేయంతోనే గ్రామ స్థాయిలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎన్నిక పారదర్శకంగా అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకుంటూ జరిగిందన్నారు. రాబోయే కాలంలో ఏర్పాటు చేసే ప్రతి ఒక్కటి కూడా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. అనంతరం వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేయగా.. అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మెన్‌తో పాటు డైరెక్టర్‌లుగా ఎన్నికైన వారిని ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జోగుల రవి, రుక్మాందర్‌రెడ్డి, తనగల సీతారాంరెడ్డి, రాజ్‌కుమార్, మద్దిలేటి, ఎల్కూరు శ్రీను, యువరాజ్, బజారి, లక్ష్మన్న, వెంకటన్న పాల్గొన్నారు.

# బీఆర్ఆర్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

**జడ్చర్ల టౌన్:** జడ్చర్ల డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా ఇచ్చిందని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య వెల్లడించారు. ఫిబ్రవరిలో న్యాక్ బృందం కళాశాలను పరిశీలించి మార్చి నెలలో ఏ–గ్రేడ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఏ–గ్రేడ్ దక్కడంతో ఢిల్లీ యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ పదేళ్ల పాటు స్వయంప్రతిపత్తి హోదా (అటానమస్) కల్పించింది. గత నెల 27న ఢిల్లీలో యూజీసీ నిర్వహించిన స్టాండింగ్ కమిటీ పరిశీలన చేసి అటానమస్ స్టేటస్ ఇస్తూ శుక్రవారం కళాశాలకు లేఖను పంపించారు. ఈ విద్యా ఏడాది 2024–25 నుంచే అమలులోకి వస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. స్వయంప్రతిపత్తి హోదా రావడంపై ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సంతోషం వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు, కళాశాల అభివృద్ధి గణనీయంగా పెరిగేందుకు అటానమస్ హోదా ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# చెరువులకు జలకళ..

- భారీ వర్షాలతో నిండిన చెరువులు, పొంగిన వాగులు
- నాలుగేళ్ల తర్వాత గట్టు చెరువు నిండడంతో ఆయకట్టు రైతుల ఆనందం
- ఇటిక్యాలలో దంచికొట్టిన వాన.. 104.3 మి.మీ వర్షపాతం నమోదు



నాడు : మే నెలలో గట్టు చెరువు ఎండిపోయి నెర్రెలు బారి ఇలా..



నేడు : నిండుకుండలా గట్టు చెరువు



గట్టు చెరువు నిండి అలుగు పారుతున్న దృశ్యం



పారుతున్న షేకుపల్లి పెద్దవాగు

**గట్టు/ఎర్రవల్లి:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులకు జలకళ వచ్చి చేరింది. గట్టు మండలంలోని చెరువు నాలుగేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నిండడంతో ఆయకట్టు రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. గురువారం అర్థరాత్రి తర్వాత గట్టు చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారింది. శుక్రవారం తెల్లారక ముందే రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున చెరువు దగ్గరకు చేరుకున్నారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి చెరువు కాల్వ ద్వారా వర్షపు నీరు ఉధృతంగా చెరువులోకి వచ్చి చేరింది. దీనికితోడు గట్టు చెరువు పైభాగంలో ఉన్న సల్కాపురం చెరువు కూడా నిండి అలుగు పారడంతో ఆ నీరంతా గట్టు చెరువులోకి వచ్చి చేరింది. ఈ ఏడాది మేలో గట్టు చెరువు పూర్తి స్థాయిలో ఎండిపోయింది. జూన్‌లో వచ్చిన వర్షానికి చెరువులో కొంత మేరకు నీరు వచ్చాయి. గట్టు చెరువు నాలుగేళ్ల విరామం (2020)తర్వాత 2024 సెప్టెంబర్‌లో పూర్తి స్థాయిలో నిండి అలుగు పారింది. అంతకు ముందు 2009 తర్వాత 11 ఏళ్లకు 2020లో చెరువు పూర్తి స్థాయిలో నిండి అలుగు పారింది. ఈ చెరువు కింది 300 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఈ చెరువు నీటిని యాసింగి పంటలకు మాత్రమే విడుదల చేస్తారు. చెరువు పైభాగంలో ఉన్న సల్కాపురం చెరువు కూడా నిండి అలుగు పారింది. ఈ చెరువు కింది 150 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఈ చెరువు నీటిని కూడా యాసంగి పంటలకు మాత్రమే విడుదల చేస్తుంటారు. రెండు చెరువులు వర్షాధారంగానే నిండుతాయి. రెండు చెరువులు నిండడంతో భూగర్భజలాలకు, సాగునీటికి కొదవలేదని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

**ఇటిక్యాలలో భారీ వర్షం**

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో గురువారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షానికి పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో అత్యధికంగా 104.3 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలంలోని ఆర్. గార్లపాడు, షేకుపల్లి, సాసనూలు, ఇటిక్యాల, ఉదండాపురం, సాతర్ల సమీపంలోని వాగులు ఉధృతంగా పారుతున్నాయి. అదేవిధంగా వల్లూరు, ఇటిక్యాల, ఉదండాపురం, పెద్దదిన్నె గ్రామాల సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల దగ్గన వర్షపు నీరు నిలిచింది. దీంతో పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, మిరప, వరి, కంది పంటల్లో వర్షపు నీరు చేసి పంటలు నీటిలో మునిగిపోయాయి. బీచుపల్లి వద్ద కృష్ణానదికి వరద ప్రవాహం పెగడంతో పుష్కరఘాట్లన్ని వరద నీటిలో మునిగిపోయాయి.

## క్లుప్తంగా

### ట్రాలీ ఆటో కిందపడి చిన్నారి మృతి



కావేరి(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ఆడుకుంటున్న చిన్నారి, ట్రాలీ ఆటో కింద పడి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని పాపయ్యనగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాడూరు మండలం చర్లఇటిక్యాలకి చెందిన మల్లేష్ జిల్లా కేంద్రంలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లేష్ కుమార్తె కావేరి(4) ఇంటి ముందు ఆడుకుంటుంది. అక్కడికి వచ్చిన టాటాఏస్ ట్రాలీ ఆటో డ్రైవర్ గమనించకుండా ఆటోను చిన్నారి పైనుంచి తీసుకెళ్లగా.. చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో డ్రైవర్ ట్రాలీ ఆటోను అక్కడే వదిలేసి పారిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాపూర్: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపూర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్లే దారిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. సుమారు 50 సంవత్సరాల వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే రాజాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# అవిఘ్నమస్తు..!

వినాయక చవితి పండగ వచ్చిందంటే చాలు.. వాడవాడలా వినాయక ప్రతిమలు వెలుస్తాయి. ప్రతి గల్లీలో సందడి నెలకొంటుంది.. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువత ఇలా అందరూ కలిసి జరుపుకొనే పండుగల్లో వినాయక చవితికి ఎంతో ప్రాధాన్యం ఉంది.. పల్లెలు.. పట్టణాలు, గల్లీల్లో యువత సంఘటితమై గణేష్ ఉత్సవాలు జరుపుకొంటారు. అయితే ఎలాంటి విఘ్నాలు ఎదురవకుండా ప్రశాంతంగా నిర్వహించాలంటే మాత్రం పోలీసుల శాఖ సూచనలు తూ.చ. తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉంది. మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవడం మొదలుకొని.. విద్యుత్, ఫైర్ సేఫ్టీ, ఉత్సవాల ముగింపు నిమజ్జనోత్సవం వరకు ప్రతీది వారి కనుసన్నల్లో ముందుకు సాగితే.. నవరాత్రుల సంతోషం ఏడాదంతా ఉంటుంది. శనివారం వినాయక చవితి నేపథ్యంలో నిర్వహణపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– మహబూబ్‌నగర్ క్రైం/ కల్వకుర్తి టౌన్



కల్వకుర్తిలోని విద్యానగర్‌కాలనీలో నవరాత్రి వేడుకలకు సిద్ధమైన వినాయక మండపం

- మండపాల ఏర్పాటులో జాగ్రత్తలు తప్పనిసరి
- పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందే
- ప్రతి విగ్రహానికి జియో ట్యాగింగ్
- ఈసారి వేడుకలపై పటిష్ట నిఘా
- నేటినుంచి వినాయక చవితి నవరాత్రులు

వినాయకుడి మండపాలను నిర్మించే సమయంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి. రోడ్డు మధ్యలో మండపాలు నిర్మిస్తే వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతాయి. రోడ్డు పక్కనే ఇబ్బంది కలగకుండా నిర్మాణం చేపట్టాలి. గణపతికి నిత్య హారతి, ధూప, దీపం సమర్పిస్తారు. ఇలాంటి సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి. వీలైతే అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. మండపంలో వెలుతురుకు విద్యుత్ ముఖ్యం. మండపానికి విద్యుత్ లైట్లు అలంకరించే సమయంలో తీగలకు ఎలాంటి అతుకులు లేకుండా నాణ్యమైనవి వాడాలి. మండపాల చుట్టూ సీరియల్ బల్బులతో డెకరేషన్ చేయకూడదు. ఇందుకు ప్రధానంగా వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి. ఒకవేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

**అధిక ధ్వనులు ఇబ్బందికరం**

నవరాత్రి ఉత్సవాల్లో భక్తి, భజన గీతాలు, మంత్రోచ్ఛరణాలు, పూజలు చేయడం తప్పనిసరి. అయితే పూజలు జరుగుతున్న సమయంలో డీజేలు, భారీ స్పీకర్లు ఏర్పాటు చేస్తుంటారు. మహబూబ్‌నగర్ పట్టణంలో డీజేలకు అధికారికంగా అనుమతి లేదు. స్పీకర్లు, మైకు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి. పూజా సమయంలో కాకుండా రోజంతా భక్తి గీతాలు మోగించడంతో పరిసర ప్రాంతాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. కేవలం పూజ జరిగే సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మైకులు వాడుకొని తర్వాత నిలిపివేయాలని పోలీసులు సూచిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత పూర్తిగా ఆపివేయాలని చెబుతున్నారు.

**పోలీసుల బందోబస్తు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గణేష్ మండపాల దగ్గర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

**ప్రత్యేక యూనిక్ ఐడీ**

నవరాత్రుల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా, ఇబ్బందులు కలిగించేవి ఉంటే వెంటనే పరిష్కరించడానికి పోలీస్ శాఖ ప్రత్యేక నజర్ పెట్టింది. దీనికి గాను ప్రత్యేకంగా ఒక పోర్టల్ రూపొందించింది. వినాయక మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల నవరాత్రుల ప్రారంభోత్సవం నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు తదితర అంశాలను సులువుగా చేపట్టవచ్చని పోలీస్ శాఖ భావిస్తోంది. ఇలా పోలీస్ శాఖ అనుమతులే కాకుండా విద్యుత్, ఫైర్ శాఖల నుంచి పొందిన అనుమతుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రూపొందించిన https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వగానే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ కనిపిస్తుంది. అందులో వినాయకుడి మంటపం ఏర్పాటు చేసే నిర్వాహకుడి పేరు, పూర్తి వివరాలు, వినాయక మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, అది ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనే వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

**సూచనలు పాటించాలి..**

వినాయక మండపాల ఏర్పాటులో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రూమర్స్ నమ్మరాదని, సందేహాలు ఉంటే సదరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలి. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ శాఖ ఇచ్చే సూచనలు పాటించాలి. పోలీస్ పోర్టల్ వివరాలను నమోదు చేసుకోవాలి. ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు అనేది సమాచారం ఉంటే బందోబస్తు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుంది.

– జానకి, ఎస్పీ, మహబూబ్‌నగర్

**విద్యుత్‌తో జాగ్రత్త**

మండపాల వద్ద విద్యుత్ సరఫరా కోసం గతంలో నిబంధనలను ఉల్లంఘించి తీగలకు వైర్లు వేసేవాళ్లకు ఈసారి దీనికి విద్యుత్ శాఖ చెక్ పెట్టింది. తప్పనిసరిగా మండపాల నిర్వాహకులు విద్యుత్ సరఫరా కోసం అనుమతి తీసుకోవాలని ప్రకటించింది. అనుమతి పొందిన వారికి తామే సరఫరా కల్పిస్తామని, ఇందుకు కనీస చార్జీలు వసూలు చేస్తామని స్పష్టం చేసింది. మండపాల్లో మామూలుగా తీగలు వేలాడేలా ఉంచడం మంచిది కాదు. వర్షపు నీరు పడి విద్యుదాఘాతానికి గాని అగ్ని ప్రమాదానికి గాని దారితీస్తోంది.

### జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు)కు చెందిన విద్యార్థినులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో కొనసాగనున్న జాతీయస్థాయి అసోసియేషన్ సబ్ జూనియర్ బాలికల జట్టుకు ఎంపికయ్యారని, వీరు తెలంగాణ తరపున ఆడనున్నారని హెచ్‌ఎం తెలిపారు. ఆగస్టు నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు కల్వకుర్తిలో నిర్వహించిన క్యాంపులో అత్యంత ప్రతిభ కనబర్చిన 22 మందిని ఎంపిక చేయగా.. గోపాల్‌పేట పాఠశాల నుంచి వీరు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

### అదుపుతప్పి ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని నల్లాలబావి వద్ద శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడిగడ్డతండాకు చెందిన పాండు, సోనా, వెల్దండ మండలం జానలగట్టుతండాకు చెందిన భీమా, మంజుల, రాచూర్‌తండాకు చెందిన సక్రులు కల్వకుర్తి మండలం తర్నికల్‌తండాకు చెందిన బంధువుల ఇంట్లోలో నిర్వహించిన శుభకార్యానికి గురువారం వెళ్లారు. శుభకార్యం ముగిసిన తరువాత శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో హైదరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో వెల్దండలోని నల్లాలభావి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు.

# జలదిగ్బంధంలో చిన్నోనిపల్లె



తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్న చిన్నోనిపల్లె గ్రామస్తులు



చిన్నోనిపల్లె ఇళ్ల మధ్యకు చేరుకున్న రిజర్వాయర్ బ్యాక్‌వాటర్

- గ్రామంలోకి చేరిన రిజర్వాయర్ బ్యాక్‌వాటర్
- తట్టాబుట్టా సర్దుకుంటున్న గ్రామస్తులు
- అధికారుల తీరుపై ఆగ్రహం
- తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకుని వెనక్కి పంపిన వైనం

గట్టు: ఇళ్ల ముందుకు రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ వచ్చి చేరుకోవడంతో ఆ ఇళ్లలో ఉండలేక, ఇల్లు విడిచి ఆరుబయట జీవనం సాగించలేక చిన్నోనిపల్లె వాసులు నరకయాతన పడుతున్నారు. ఇది చాలదన్నట్లుగా ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మరింత ఆందోళన చెందుతూ ముంపు గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇంత జరుగుతున్నా.. ముంపు గ్రామస్తులను పలకరించేందుకు అధికారులు, నాయకులు అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో చిన్నోనిపల్లె వాసులు మరింత ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు చిన్నోనిపల్లె చుట్టూ ఉన్న వాగులు పొంగి, రిజర్వాయర్‌లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో రిజర్వాయర్ బ్యాక్ వాటర్ చిన్నోనిపల్లెలోకి చేరుకున్నాయి. ఇప్పటికే కొంత మంది తట్టాబుట్టా సర్దుకుని బతుకు జీవుడా అంటూ కన్నీటితో ఊరికి వీడ్కోలు పలికారు. ఊళ్లోకి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ రావంటూనే తమను నిండా ముంచారని, కనీసం తల దాచుకునేందుకు కూడా అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. గ్రామంలోని 350 ఇళ్లకు గాను ఇప్పటికే 70 ఇళ్లు నీటిలోకి చేరుకున్నట్లు తెలిపారు. ఆ ఇళ్లలో ఉండే వారు ఇళ్లను ఖాళీ చేసి, మరో చోటుకు చేరుకున్నారు.

**అడ్డుకున్న గ్రామస్తులు..**

గ్రామంలోకి రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ చేరుకుని మూడు రోజులు గడిచినా.. కనీసం ఎలా ఉన్నారు. ఏం చేస్తున్నారని పలకరించే వారే లేరని, కష్టాల్లో ఉన్న తమను ఆదుకోవాల్సిన అధికారులు ఏం పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. గ్రామ పరిస్థితులు తెలుసుకునేందుకు శుక్రవారం గ్రామానికి చేరుకున్న తహసీల్దార్ సరితారాణి, ఆర్‌ఐ రాజు వాహనాన్ని గ్రామస్తులు అడ్డుకుని తిప్పిపంపారు.

**ఒక్కొక్కరుగా ఊరిని విడుస్తూ...**

ఇంకా ఇప్పటి దాకా గ్రామంలో సగం మందికి పునరావాస కేంద్రంలోకి మారేందుకు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించలేదు. పునరావాస కేంద్రంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలను కల్పించినప్పటికీ గత్యంతరం లేక చిన్నోనిపల్లె వాసులు ఒక్కొక్కరుగా ఊరిని విడిచిపెడుతున్నారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో మహిళ మృతి



అంజమ్మ (ఫైల్)

కోయిల్‌కొండ: మనికొండకి చెందిన అంజమ్మ(38) గురువారం సాయంత్రం పశువుల కోసం పేర్కివీడు శివారులోని ఓ రైతు పొలంలో గడ్డి కోసుకొని గడ్డిమోపు తలపై పెట్టుకొని వెళ్తుంది. ఈ క్రమంలోనే తీవ్రమైన గాలి, వాన రావడంతో అదే పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం నుంచి ఎల్‌టీ వైరు తెగి అంజమ్మపై పడటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

### గుంతలో పడి వృద్ధుడు..

హన్వాడ: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధుడు నీటి గుంతలో పడి మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. మండలంలోని గొండ్యాల్‌కు చెందిన చాకలి వెంకప్ప(60) మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లోంచి వేపూర్ వైపు వెళ్లగా.. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న వేపూర్‌కు చెందిన ఆనంద్ వ్యవసాయ పొలంలోని నీటిగుంతలో పడి మృతిచెందాడు. మృతదేహం పైకి తేలడంతో గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకప్ప భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

### ఉరేసుకుని వ్యక్తి..

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బాలస్వామి(50) అనే వ్యక్తి ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలస్వామితో తన భార్య స్వరూప నాలుగేళ్ల క్రితం గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో బాలస్వామి తన తండ్రి లక్ష్మయ్యతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో లక్ష్మయ్య గురువారం తన కూతురిని చూడటానికి కుమ్మెర గ్రామానికి వెళ్లాడు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలస్వామి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు శుక్రవారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు, బంధువులు సమాచారం అందించారు. మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కాగా బాలస్వామి తన మొదటి భార్య మణెమ్మ మృతి చెందడంతో స్వరూపను రెండో వివాహం చేసుకున్నాడు.

# జూరాలకు మళ్లీ వరద

- ప్రాజెక్టుకు 1.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 16 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల



ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ప్రాజెక్టుకు 82 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. శుక్రవారం సాయంత్రానికి 1.36 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 16 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,12,848 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల నుంచి ఉత్పత్తి కొనసాగుతోంది. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 30,954 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు నుంచి 45 క్యూసెక్కులు ఆవిరవుతుండగా.. ఎడమ కాల్వకు 290 క్యూసెక్కులు, కుడి కాల్వకు 185 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.869 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

**కొనసాగుతున్న విద్యుదుత్పత్తి**

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతోంది. శుక్రవారం 11 యూనిట్ల నుంచి ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువ 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు.. 139.126 ఎం.యూ., దిగువ 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 108.085 ఎం.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 247.211 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని వివరించారు.